బతుకులు కూల్చేశారు



ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్న ఎస్‌ఐ సునీత



జీవీఎంసీ టీపీవో శ్రీలక్ష్మితో సీఐటీయూ నాయకుడు రాజ్‌కుమార్, బాధితుల వాగ్వాదం

- వుడా కాలనీ రోడ్డులో సుమారు 80 బడ్డీలు, దుకాణాల తొలగింపు
- రోడ్డుపై వ్యాపారుల బైఠాయింపు
- పెద్దల వైపు చూడని అధికారులు
- నేడు జోనల్ ఆఫీసు ముట్టడికి సీఐటీయూ పిలుపు



వుడా కాలనీ రోడ్డులో దుకాణాన్ని కూల్చేస్తున్న దృశ్యం

తమ బతుకులను కూల్చేశారని చిరు వ్యాపారులు కన్నీటి పర్యంతమయ్యారు. ముందస్తు సమాచారమైనా ఇవ్వకుండా తమను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మధురవాడ, ఎండాడ, తగరపువలస ప్రాంతాల్లో రోడ్డు వెంబడి, ఫుట్‌పాత్‌లపై ఉన్న దుకాణాలను జీవీఎంసీ అధికారులు, సిబ్బంది గురువారం యంత్రాలతో తొలగించడంతో ఆ ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. ఏళ్ల నుంచి ఆశీలు కడుతున్నామని, ట్రేడ్ లైసెన్స్ ఉన్నా కూడా తమ దుకాణాలను కూల్చేశారని కన్నీరుమున్నీరయ్యారు. ఇది అన్యాయమంటూ ఆందోళనలకు సన్నద్ధమవుతున్నారు.



టీడీఆర్ ఇచ్చిన స్థలంలో తొలగించని దుకాణాలు



చిరు వ్యాపారులపై దాష్టీకానికి వ్యతిరేకంగా రోడ్డుపై సీఐటీయూ ఆధ్వర్యంలో బైఠాయింపు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్–2లోని మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై ఉన్న బడ్డీలు, తోపుడు బళ్ల తొలగింపు ఉద్రిక్తంగా మారింది. జోన్–2 టీపీవో వై. శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం ఈ రోడ్డు హైవే నుంచి తొలగింపు ప్రారంభించారు. ముందుగా జెడ్సీ కనక మహాలక్ష్మి పోలీసులు, ఇతర అధికారులతో వచ్చి ఎంతవరకు తొలగింపు చేపట్టాలనేది కొలతలు వేసి దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు సుమారు 80వరకు బడ్డీలు, తోపుడు బళ్లు, బోర్డులు తొలగించి, జీవీఎంసీ వాహనం ద్వారా తరలించారు. అధికారులు పెద్దలు, రాజకీయ పలుకుబడి ఉన్న వారిపట్ల ఒక రకంగా, సామాన్యుల పట్ల మరో విధంగా వ్యవహరించారని వ్యాపారులు వాపోయారు.

రోడ్డుపై బైఠాయింపు

కనీసం సమాచారం ఇవ్వకుండా.. మూకుమ్మడిగా చిరు వ్యాపారుల పొట్టకొట్టడం అన్యాయమని సీఐటీయూ అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వ్యాపారులు రోడ్డుపై బైఠాయించారు. అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చాలాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పీఎం పాలెం ఎస్‌ఐ సునీత, ఏఎస్‌ఐ శ్యాం ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని, ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు.

ప్రభుత్వం కమిటీ ఎందుకు వేసినట్లు?



వీధి వ్యాపారులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం కమిటీ వేసింది. దీని ద్వారా మాకు రక్షణ కల్పిస్తామన్నారు. నేను కమిటీలో సభ్యుడిని. ఇలా చేస్తున్నట్లు నాకు కూడా కనీస సమాచారం లేదు. అలాంటప్పుడు కమిటీలు ఎందుకు? ఇది చాలా అన్యాయం.

– ధనుంజయ, వీధి వ్యాపారుల కమిటీ సభ్యుడు

జీవీఎంసీని ముట్టడిస్తాం



అధికారులు చాలా అన్యాయంగా పేదలపై దాడి చేసి, వారి కుటుంబాలను రోడ్డున పడేశారు. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా తొలగింపు సరికాదు. వీరి తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం మధురవాడ జోనల్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. అంతా సహకరించాలి. –పి.రాజ్‌కుమార్, సీఐటీయూ నాయకుడు

ఉన్నపళంగా వెళ్లిపొమ్మంటే ఎలా?

రెండు రోజుల వ్యవధి ఇవ్వమని వేడుకున్నా ఫలితం లేకపోయింది

ఎండాడలో వ్యాపారుల ఆవేదన



ఎండాడ డబుల్ రోడ్డులో దుకాణాలు తొలగిస్తున్న అధికారులు



ఎండాడలో పొక్లెయిన్‌తో దుకాణాలు తొలగిస్తున్న దృశ్యం

కొమ్మాది: ఎండాడ జాతీయ రహదారి నుంచి రుషికొండ వెళ్లే డబుల్ రోడ్డు వెంబడి దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వ్యాపారుల పొట్టపై కూటమి ప్రభుత్వం దెబ్బకొట్టింది. ముందస్తు సమాచారం లేకుండా దుకాణాలు తొలగించడంతో వ్యాపారులంతా కన్నీటి పర్యంతమయ్యారు. ఇక్కడ తోపుడు బళ్లు, టిఫిన్ సెంటర్లు, మెకానిక్ షాప్‌లు, చికెన్ సెంటర్లు, పాన్ షాప్‌లు, బేకరీలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, ఉన్నపళంగా వెళ్లిపొమ్మంటే ఎక్కడికి వెళ్తామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండు రోజుల వ్యవధి ఇవ్వాలని అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయిందని వాపోయారు. జిల్లాలో క్లీన్‌సిటీ పేరుతో ప్రతి రహదారి క్లీన్‌గా ఉండాలనే ఉద్దేశంతో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు ఈ దుకాణాలు తొలగిస్తున్నట్లు జీవీఎంసీ, పట్టణ ప్రణాళిక అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న దుకాణాలను పొక్లెయిన్‌తో తొలగించి, కొన్ని తరలించే కార్యక్రమాలు చేపట్టారు. సుమారు 20 దుకాణాలు తొలగించారు. ఇంత జరుగుతున్నా స్థానిక కూటమి నాయకులు పట్టించుకోలేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి నాయకులు పేదల కడుపు కొట్టడమేమిటని వ్యాపారులు ప్రశ్నించారు.

తగరపువలస మెయిన్‌రోడ్డులో..



ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద ఫుట్‌పాత్‌లపై దుకాణాల తొలగింపును పర్యవేక్షిస్తున్న జెడ్సీ అయ్యప్ప నాయుడు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని తగరపువలస మెయిన్‌రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న వారి షెడ్లు, చిరు వ్యాపారాలను జెడ్సీ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్, పోలీస్, సచివాలయ సిబ్బంది గురువారం తొలగించారు. చిట్టివలస ఈఎస్‌ఐ ఆస్పత్రి మొదలుకుని అంబేడ్కర్ కూడలి వరకు ఈ తొలగింపులు జరిగాయి. రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై ఉన్న తోపుడుబండ్లు, భవన నిర్మాణ మెటీరియల్‌ను జేసీబీలతో తొలగించి డంపింగ్‌యార్డుకు తరలించారు. కొందరు వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకున్నారు. నాలుగు రోజుల పాటు ఆక్రమణల తొలగింపు జరుగుతుందని జీవీఎంసీ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

అనంతుని హుండీ ఆదాయం రూ.2.43 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీహరి సేవాదళం సభ్యులు

పద్మనాభం: పద్మనాభంలోని అనంత పద్మనాభ స్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. హుండీ ద్వారా రూ.2,43, 988 ఆదాయం వచ్చిందని ఈవో నానాజీబాబు తెలిపారు. 2024 డిసెంబర్ 2వ తేదీ నుంచి 2025 సెప్టెంబర్ 18 వరకు హుండీల ద్వారా ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. శ్రీహరి సేవా దళం భక్తులు 12 మంది ఈ ఆదాయాన్ని లెక్కించారు. ఈవో పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభస్వామి, కోరాడ రమణ, కంటుబోతు ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వీఎస్‌ఎన్ రాజు ఇక లేరు



ఎన్‌వీఎస్‌ఎన్ రాజు (ఫైల్)

పద్మనాభం: ఉమ్మడి రాష్ట్ర సహకార సంఘం మాజీ ఎండీ సాగి వెంకట సూర్యనారాయణ రాజు (93) గురువారం మృతి చెందారు. పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో తన ఇంటి వద్ద ఆయన మృతి చెందారు. వార్ధక్య సమస్యలతో కొంతకాలంగా ఆయన బాధపడుతున్నారు. రాజు భౌతిక కాయాన్ని పలువురు సందర్శించి, నివాళులర్పించారు.

పరిశుభ్రతపై పోస్టల్ సిబ్బంది ప్రచారం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారి జగదీశ్వరరావు

తగరపువలస: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం గొట్టిపల్లి పంచాయతీలో విద్యార్థులకు పరిశుభ్రతపై పోస్టల్ సిబ్బంది గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నార్త్ సబ్ డివిజన్ అధికారి జి.జగదీశ్వరరావు నుక్కడ్ నాటక్ కార్యక్రమం ద్వారా పరిశుభ్రత ప్రాధాన్యతను స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం పోస్టల్ సేవల గురించి వివరిస్తూ, వీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ వెంకటరావు, సత్యసాయి ఆదర్శ గ్రామం కో–ఆర్డినేటర్ డబ్బీరు విజయకుమార్, కో కన్వీనర్ డీపీ రాజు, ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డెక్కల్లో పుండ్లతో మూగజీవాలు విలవిల



పందలపాకలో మెక్కుతూ నడుస్తున్న గొర్రె

తగరపువలస: ఆనందపురం మండలంలో పశు వైద్యం మారుమూల గ్రామాలకు చేరడం లేదు. నిరక్షరాస్యులైన పాడిరైతులు వీటికి వైద్యం అందించలేక నాటు వైద్యం చేస్తూ నష్టపోతున్నారు. ఇటీవల మండలంలోని ఒక్కో పంచాయతీలో రైతులకు చెందిన పదుల సంఖ్యలో మేకలు, గొర్రెలు డెక్కలలో పుండ్లతో బాధ పడుతున్నాయి. మూగజీవాలకు సరైన వైద్యం అందని కారణంగా చతికిలపడి మేత మేయకపోవడంతో ప్రాణాలు విడుస్తున్నాయని రైతులు వాపోతున్నారు. పశువైద్యాధికారులు ఆస్పత్రులలో ఉండటం లేదని, వ్యాక్సిన్ల పేరుతో ఫీల్డ్‌కు వెళ్తున్నట్టు చెప్పి మూగజీవాల వైద్యానికి డుమ్మా కొడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

ఘనంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తగరపువలస: ఆనందపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు. ఈ కారణంగా ఆనందపురం, బంటుపల్లి కళ్లాలు, పెద్దిపాలెం, పొడుగుపాలెం, కుసులవాడ, దండువారి కళ్లాలు, గొట్టిపల్లి, ఏనుగులపాలెం, రేగానిగూడెం, రామునేనిపేట, చిన్నయ్యపాలెం, జగన్నాథపురం, వెంకటాపురం, చందక తదితర గ్రామాల్లో గృహ, పారిశ్రామిక అవసరాలకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

బక్కన్నపాలెం ఫీడర్ పరిధిలో..

పీఎం పాలెం: బక్కన్నపాలెం 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ హెచ్‌పీసీఎల్ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా అవుతున్న ప్రాంతాల్లో చెట్ల కొమ్మల నరికివేత, విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జోన్–3 ఈఈ (ఆపరేషన్స్) సింహాచలం నాయుడు తెలిపారు. పైన పేర్కొన్న సమయంలో జీవీఎంసీ ఆరోవార్డులోని సాండ్ అండ్ సాండ్ లేఅవుట్ ఏరియా, హెచ్‌పీసీఎల్ లేఅవుట్, ఎస్‌బీఐ, సుగర్ ఫ్యాక్టరీ లేఅవుట్‌లు, సృజనా స్కూల్ ఏరియా, బక్కన్నపాలెం, పాత లలితా దేవి టెంపుల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

క్రికెట్ స్టేడియం ఫీడర్ ఏరియాలో...

11కేవీ క్రికెట్ స్టేడియం విద్యుత్ ఫీడర్ ఏరియాలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. ఈ కారణంగా కారుషెడ్ కూడలి, ఏపీ హెచ్‌బీ కాలనీ, మాలతాంబ స్కూల్ ఏరియా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, వెంకటేశ్వర స్వామి టెంపుల్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు.

భీమిలి సబ్‌స్టేషన్ పరిధిలో..

తగరపువలస: భీమిలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తెలిపారు.

ఈ కారణంగా భీమిలి, నేరెళ్లవలస, జేవీ అగ్రహారం, కొత్తవలస, నిడిగట్టు, కుమ్మరిపాలెం, స్మిత్ వీధి, అప్పికొండవీధి, బ్యాంకు కాలనీ, కొత్త మూలకుద్దు, మామిడిపాలెం, రేఖవానిపాలెం, మహాలక్ష్మీపురం, మహిళా పాలిటెక్నిక్ కళాశాల, జగనన్న కాలనీ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గ్రావెల్ తరలింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



నగరంపాలెం శ్మశాన వాటిక నుంచి తరలిపోతున్న గ్రావెల్

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డులో మాస్టర్ ప్లాన్ రోడ్డు కోసం గ్రావెల్‌ను అక్రమంగా తరలించడంపై కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు ఇచ్చినట్టు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు ప్రకటనలో తెలిపారు. ఈ రోడ్డు ప్రజలకు ఎంతో ఉపయోగపడేదే అయినా, దీని కోసం నగరంపాలెం శ్మశాన వాటిక ప్రహరీని ఆనుకుని ఉన్న గ్రావెల్ తవ్వేయడం సరికాదని పేర్కొన్నారు. దీనివల్ల ప్రహరీ పడిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి గ్రావెల్ తవ్వకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని కోరారు. ఒకవేళ అనధికారికంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లయితే తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు



వేములవలసలో టీ దుకాణంలో మద్యం తాగుతున్న వ్యక్తులు

తగరపువలస: ఆనందపురం మండలంలో మద్యం ఏరులై పారుతోంది. మద్యం దుకాణాలలోనే కాకుండా ప్రతి పంచాయతీలో 10 నుంచి 20 వరకు బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఇవి కాకుండా వేములవలస మార్కెట్‌తో పాటు దానిని ఆనుకుని ఉన్న ప్రతి దుకాణంలో వేకువజాము నుంచే మద్యం దొరుకుతోంది. టీ కొట్లు, పండ్ల దుకాణాలు, పాన్ షాపులు, కిరాణా దుకాణాలలో మద్యంతో పాటు డిస్పోజల్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు, వేయించిన బఠాణీలు, ఫ్రై చేసిన కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. చివరకు పూజా సామాగ్రి విక్రయించే చోటా వీటిని సరఫరా చేస్తున్నారు. అతిగా మద్యం సేవించిన వారు అక్కడికక్కడే పడిపోతున్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడాన్ని అడ్డుకోవాలని విద్యార్థులు, మహిళలు కోరుతున్నారు.

ఆరుతడి పంటలపై అవగాహన



మజ్జిపేటలో వివిధ దేశాల ప్రతినిధులు

తగరపువలస: ఆరుతడి పంటలపై ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌డ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో భీమిలి మండలం మజ్జిపేట, పద్మనాభం మండలం కొవ్వాడలో గురువారం అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాలకు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరై ఆరుతడి పంటల వలన కలిగే లాభనష్టాల గురించి తెలియజేశారు. ఆరుతడి పద్ధతిలో వరి సాగు వలన 25 శాతం నీరు ఆదా చేసుకోవచ్చన్నారు. భూగర్భజలాల సంరక్షణ, ఆరోగ్యానికి కూడా ఇది దోహదపడుతుందన్నారు. ఈ పద్ధతిలో నిరంతరం కాకుండా అప్పుడప్పుడు నీరు పెట్టడం వలన నీటి వినియోగం, ఖర్చులు తగ్గుతాయన్నారు. పంటలో మీథేన్ వాయువు ఉత్పత్తి తగ్గి పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు. అయితే సమయానికి నీరు అందుబాటులో లేకపోతే నష్టం కలిగే అవకాశాలు కూడా ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు అంకిత, పవన్, కేథరిన్, పాల్ నికల్సన్, సుహాస్ చంద్ర, సాయికిషోర్, హువాంగ్, క్విన్యూ, జున్ వే లిమ్, శశాంక్, షగున, సౌమిత, జూడిత్, అంజూ, దాక్షాయిణి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డస్ట్‌బిన్‌లా ట్రాఫిక్ ఐలాండ్



ట్రాఫిక్ ఐలాండ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర సామగ్రి

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండ కూడలి వద్ద ఉన్న ట్రాఫిక్ ఐలాండ్ కాస్త డస్ట్‌బిన్‌గా మారిపోయింది. ఈ ప్రధాన కూడలి వద్ద నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికి సమీపంలోనే పర్యాటక ప్రాంతం అయిన రుషికొండ బీచ్, టీటీడీ దేవాలయం, కళాశాలలు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో, ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు ఇక్కడ ట్రాఫిక్ ఐలాండ్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం దీనిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర సామగ్రి ఉంచడంతో డస్ట్‌బిన్‌గా మారిపోయింది. దీంతో పోలీసుల నిర్వహణ తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష



ఆనందపురంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక



సాగర్‌నగర్ యూపీహెచ్‌సీలో ఓపీ నమోదు చేస్తున్న సిబ్బంది



వుడా కాలనీ యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేసి, మందులిస్తున్న వైద్యులు

తగరపువలస: మహిళల ఆరోగ్యమే వారి కుటుంబాలకు రక్ష అని ఆనందపురం ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక అన్నారు. వారు ఆరోగ్యంగా ఉండే ఆ కుటుంబాలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా ఆనందపురంలో వైద్య శిబిరాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఎంపీడీవో జానకి, పీహెచ్‌సీ వైద్యురాలు షేక్ షబీనా భాను మాట్లాడుతూ వైద్య శిబిరాల ద్వారా అందుతున్న వైద్య సేవల గురించి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైద్యులు శ్రీనివాసరావు, ప్రకాష్, హృదయ్, హేమ, అరుణశ్రీ పాల్గొన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని యూపీహెచ్‌సీలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణుల కు, మహిళలకు రక్త పరీక్షలతో పాటు టీబీ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించామని ప్రధాన వైద్యురాలు పూజ తెలిపారు. సుమారు 200 మందికి పైగా రోగులను పరీక్షించి, మందులు అందజేశామన్నారు.

మిథిలాపురి వుడా కాలనీలో..

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ యూపీహెచ్‌సీలో సుమారు వంద మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. చిన్నపిల్లలు, మహిళల వైద్య నిపుణులతో పాటు ఆయుర్వేద వైద్యులు ఈ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసే కుట్ర



బొడ్డు అప్పలనాయుడు

తగరపువలస: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు వైద్యవిద్యను అందకుండా చేస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాగవంశం విభాగం అధ్యక్షుడు బొడ్డు అప్పలనాయుడు అన్నారు. ఆయన గురువారం చిట్టివలసలో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానం ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలన్నారు. ప్రైవేట్‌లో విద్యా రుసుములు పెరిగి పేద, బీసీ విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. పేద, బీసీ విద్యార్థులకు వైద్య విద్య అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను స్థాపించారన్నారు. ప్రైవేటీకరణ జరిగితే విద్యార్థులు రిజర్వేషన్లు కోల్పోయి, ఉన్నత విద్యకు దూరమవుతారన్నారు.

నవంబర్ 28న సదస్సు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో ఇండియన్ ఫార్మాసిటికల్ అసోసియేషన్ విశాఖపట్నం బ్రాంచితో కలిసి నవంబర్ 28న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు.